

# అంతర్వేదన

పంజాల జగన్నాథం

సాయంకాలం ఐదు కావస్తూంది. సూర్యుడు ఆకాశమంతా ఎర్రడాలు చేస్తూ పశ్చి కొండల్లోకి నెమ్మదిగా దిగిపోతున్నాడు. పక్షులు గూటికి చేరుకుంటున్నాయి. గూటికి చేరిన పక్షుల కిలకిలలు. 'పాప స్కూలు నుండి ఇంకా రాలేదండీ' ఆందోళనగా అంది నీరజ చంకలోని చంటిగాణ్ని సర్దుకుంటూ అప్పుడే ఆఫీసు నుండి వచ్చిన భర్త నితిన్‌తో.

ఆఫీసు పని విరివిగా ఉండి కాబోలు నితిన్ మొహం అలసటగా కనిపించింది. చల్లని గాలి రివ్వున వీస్తున్నా అతని మొహం, శరీరం చెమట పట్టి ఉన్నాయి. నుదురు, చెంపలపై స్వేద బిందువులు తళతళమెరుస్తూ రాలుతున్నాయి. 'పాప ఇంకా రాలేదా?' అని మాత్రమే అనగలిగాడు.

నీరజ అప్పటికే పాప స్నేహితురాళ్ళ అందరి ఇళ్ళకు ఫోన్ చేసి కనుక్కుంది. అన్ని చోట్ల నుండి ఒకటే సమాధానం 'రాలేదని'. ఆమెలో ఆరాటం, గుండెలో గుబులు మొదలయింది. స్కూల్‌కు కూడా ఫోన్ చేసింది. స్కూల్లో ఎవరూ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. బహుశా ఆఫీస్ రూమ్, ప్రిన్సిపాల్ గది అన్నీ తాళాలు వేసి వెళ్ళారేమో. భర్త రాగానే ఎక్కడెక్కడ వాకబు చేసింది తను అంతా చెప్పింది. 'మనం స్కూలుకి వెళ్ళి పాప ఆచూకీ గురించి ఆరా తీద్దామండి. త్వరగా వెళదాం పదండి' వచ్చీ రాగానే ఎంతో ఆదుర్దాతో భర్తను తొందర చేసింది నీరజ. నితిన్ బ్రీఫ్‌కేసును గదిలో పడేసి స్కూటర్ తీసి స్కూల్ వైపు పోనిచ్చాడు. వెనుక సీట్లో నీరజ బాబునెత్తుకొని కూర్చుంది.

నీరజ, నితిన్‌లకు తొలి సంతానం శాలిని. వయస్సు ఆరు సంవత్సరాలు. ఎర్రగా, బొద్దుగా వయస్సుకు మించిన పర్సనాలిటీతో చలాకీగా ఉండేది. పాప బుల్లిబుల్లి మాటలు ఎంతో ముద్దుగొలిపేవి. పాప ఒకటవ తరగతి చదువుతున్నప్పటికీ ఐ.క్యూ చాలా ఉండేది. పాప తాలూకు స్మృతులు నీరజ మనస్సును తొలుస్తున్నాయి. ఈ మధ్యన పాపలని కిడ్నాప్ చేస్తున్నారనీ, రెడ్‌లైట్ ఏరియాలో అమ్ముతున్నారనీ, మనుషులకు మత్తుమందిచ్చి ఎత్తుకెళ్ళి కిడ్నీలను దొంగిలించి విదేశాలకు ఎగుమతి చేసే ఓ పెద్ద గ్యాంగ్ దేశంలో పనిచేస్తుందనీ పేపర్లో వార్తలు. జనంలో ఎన్నోరకాల వదంతులు. ఇవన్నీ నీరజ గుండెల్ని పిండి వేస్తున్నాయి.

స్కూల్ ఆవరణ వచ్చేసింది. ఆవరణ చాలా పెద్దగా ఉంది. చుట్టూ ఎత్తయిన ప్రహరీ గోడ. పెద్ద గేటు. ఆవరణలో కొంత భాగం గార్డెన్ పెంచారు. గార్డెన్‌లోని నేలంతా పచ్చగడ్డి తివాచీలా పరిచినట్లుంది. తోటమాలి పూలమొక్కలకు నీళ్ళు పడుతున్నాడు. ఓ ఆడమనిషి చమాన్‌లో కలుపుమొక్కలు తీసివేస్తూంది. మరోవైపు విశాలమైన మైదానం. ఓ మూల బోర్‌వెల్ ఉన్నాయి. గేటు నుంచి చూస్తే మైదానానికి ఆవలివైపు వెనుక కాంపౌండ్ వాల్‌కు దగ్గరల్లో స్కూల్ బిల్డింగ్, దానికి పక్కనే కొద్ది దూరంలో హాస్టల్ భవనం ఉన్నాయి. డేస్కాలర్స్ అంతా వెళ్ళిపోయారు. స్టడీ అవర్స్ కావడం వల్లనేమో ఆవరణ అంతా నిశ్శబ్దంగా ఉంది. మైదానంలో పిల్లల సందడి లేదు. పిల్లలంతా క్లాసురూముల్లో చదువుతున్నారు.

'క్యా హోనా సాబ్' చౌకీదారు వచ్చిన అపరిచిత వ్యక్తుల్ని అడిగాడు. 'హమారా బచ్చీ ఇస్ స్కూల్‌మే పడ్ రహీ హై. వహ్ ఘర్ వాపస్ నహీ ఆయీ. వహ్ బచ్చీకో ఆప్ దేఖే' అంటూ పాప ఎలా ఉంటుందో వివరించి చెప్పింది నీరజ. 'మై నహీ దేఖా హాస్టలర్స్‌కే బినా యహ్ కోయీ బీ నహీ హై. బాహర్‌కె సబ్ లోగ్ చలే గయే' సమాధానమిచ్చాడు చౌకీదారు.

తోటమాలి హన్మంతును గుర్తుపట్టింది నీరజ. హన్మంతుకు వాళ్ళ పాప తెలుసు. 'ఏం హన్మంతు మా పాపను చూశావా?' అడిగింది నీరజ. 'లేదమ్మగారు నేనీరోజు అసలా పాపనే చూడలేదు' దీనంగా చెప్పాడు హన్మంతు. పొద్దుచీకటి పడుతూంది. కాళ్ళల్లో నీరసం మొదలయింది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. దుఃఖం ఆగడంలేదు. ఓవైపు చంటిపిల్లాడు ఏడుస్తున్నాడు. నీరజకు ఏమీ పాలుపోవడం లేదు. ఆమె మనసంతా ఎన్నో వేల సూదులతో గుచ్చినంత బాధగా ఉంది.

మాతృ హృదయం. తల్లడిల్లే మనస్సు. తపించే గుండెలు. మాటలకందని మౌనరాగాలు. భాషకందని మౌన రోదన. అంతర్వేదన. పదాల కందని బాధ. చీకటిపడ్డ కొద్దీ గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. చంకలోని పిల్లాడ్ని ఎంత సముదాయించినా ఊర్కోవడంలేదు. అంత దుఃఖంలోనూ 'ఏమండీ పోలీసుస్టేషన్‌కి వెళ్ళి కంప్లైంట్ చేద్దాం' గుండెలు బిగుపట్టుకొని నీరజ భర్తతో అంది. నితిన్ పరాకు పరాకుగా ఉన్నాడు. పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూనే స్కూటర్‌ను పోలీసుస్టేషన్ వైపు పోనిచ్చాడు. అతని ప్రతీ కదలికలో ఏదో తత్తరపాటు కనిపిస్తోంది.

నితిన్ మస్తిష్కంలో పాప స్మృతులు మెదలసాగాయి. నితిన్ చైన్ స్మోకర్. ఓసారి నీరజకు జబ్బు చేస్తే హాస్పిటల్‌కు వెళ్ళినప్పుడు పాప కూడా వాళ్ళతో వెళ్ళింది. హాస్పిటల్‌లో వేలాడదీసిన బోర్డును వాళ్ళ డాడీకి చూపిస్తూ 'సీ డాడీ లంగ్స్ ఎట్ వర్క్, డోంట్ స్మోక్' క్రీగంట చూస్తూ ట్రేస్ చేసి మరీ మరీ చెప్పింది. నితిన్ వాకింగ్‌కు వెళ్ళని రోజు 'డాడీ ఈ రోజు వాకింగ్‌కు ఎందుకు వెళ్ళలేదు?' అంటూ నిలదీసేది. 'స్కూల్‌కు టైమయింది డాడీ త్వరగా తీసుకెళ్ళు' అంటూ మారాం చేసేది. పాప జ్ఞాపకాల అలల్లో కొట్టుకుపోతున్నాడు నితిన్. దేహం దహించి వేస్తూంది. గుండెలు కాలిపోతున్నాయి. మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది. దుఃఖం కట్టలు తెంచుకు వస్తూంది.

స్టేషన్లో పాప వివరాలతో కంప్లైంట్ రాసిచ్చి ఎలాగైనా ఆచూకీ తీసి మా పాపను మాకు అప్పగించండని చేతులు జోడించి బేలగా ఎస్.ఐతో ప్రాధేయపడింది నీరజ. 'మా శాయశక్తులా కృషి చేసి మీ పాపను మీ కప్పగిస్తాం' అంటూ ఎస్.ఐ ధైర్యం చెప్పాడు నీరజకు. ఎస్.ఐకి నేర పరిశోధనలో దిట్ట అనే పేరుంది. కేసును ఇన్వెస్టిగేట్ చేయడం ఆరంభించాడు. పోలీసు బ్రెయిన్‌కు పదును పెట్టాడు. చేయవలసిన చర్యలన్నీ తక్షణమే చేపట్టాడు.

మరుసటి రోజు ఎస్.ఐ నితిన్ ఇంటికి వచ్చి నీరజను ఇంటరాగేట్ చేయడం ఆరంభించాడు.

'ఆ రోజు పాపను స్కూల్‌కు ఎవరు తీసుకెళ్ళారు?' ఎస్.ఐ అడిగాడు.

'మా ఆయన' నీరజ సమాధానం.

'ఎన్ని గంటలకి?'

'ఉదయం ఎనిమిదిన్నర గంటలకి' టైమ్‌ని నితిన్ చేత ఖరారు చేసుకున్నాడు ఎస్.ఐ.

ఎస్.ఐ. స్కూలుకు వెళ్ళాడు. ప్రిన్సిపాల్‌ను కలిసి పాప అటెండెన్స్‌ని తనిఖీ చేసాడు. ఆ రోజు పాప స్కూల్‌కి ఆబ్సెంట్ మార్క్ చేయబడింది. అంటే 'ఆ రోజు స్కూల్‌కు రాలేదన్నమాట' తల పంకించాడు. తనలో తాను ఏదో ఆలోచించసాగాడు ఎస్.ఐ. పాప క్లాసుపిల్లల్ని కొన్ని ప్రశ్నలు అడిగాడు. 'శాలిని స్కూల్‌కు రాలేదు అంకుల్' ఓ బేబీ ముద్దుగా చెప్పింది. 'నేను స్కూల్‌కు వస్తుంటే శాలినికి చాక్లెట్లు కొని పెట్టి ఓ నర్సు తీసుకెళ్ళగా చూశా' అంటూ పాన్‌టేలాను చూపించింది ఓ పాప. లాఠీకర్రను చేతిలో చరుచుకుంటూ దీర్ఘంగా ఆలోచించసాగాడు. చుట్టూ కలియజూశాడు. నెమ్మదిగా ఆలోచించుకుంటూ పాన్‌టేలా చేరుకున్నాడు ఎస్.ఐ.

'ఫలానా పాపను తీసుకుపోగా నిన్న నీవు ఎవరినైనా చూశావా' అడిగాడు ఎస్.ఐ. పాన్‌టేలా వ్యక్తిని. టేలావాడు కొంచెం తటపటాయించి 'ఆ చూశాను సార్. ఓ నర్సు నా కొట్లో చాక్లెట్లు కొనిపెట్టి ఓపాపను తీసుకెళ్ళింది' చెప్పాడు టేలావాడు. ఎస్.ఐ. మనస్సులో కేసు గురించి పేరుకున్న మబ్బుతెరలు కొంచెం కొంచెం తొలగిపోతున్నాయి. 'నువ్వు ఆమెను గుర్తుపట్టాలి' హుకుం జారీ చేశాడు ఎస్.ఐ. భయంతో 'జీ సాబ్' అన్నాడు టేలావాడు. ఎస్.ఐ టేలావాణ్ణి జీపులో ఎక్కించుకొని టౌన్‌లో ఉన్న హాస్పిటల్స్ అన్నీ గాలించాడు. ఓ హాస్పిటల్‌లో 'ఇదిగో నల్లగా ఎత్తుగా ఉన్న ఈవిడే ఆ నర్సు' అంటూ గుర్తుపట్టాడు.

ఎస్.ఐ. పోలీసు భాషలో నర్సును భయపెట్టాడు. బెదిరించాడు. 'పాపను నీకెవ్వరప్పగించారు? ఆ పాప ఏమైంది?' గద్దించాడు ఎస్.ఐ. నర్సు భయకంపితురాలయింది. గజగజ వణికిపోతూ జరిగిన సంగతంతా వివరించింది. ఒక్కమారుగా ఆశ్చర్యపోయాడు ఎస్.ఐ. ఎన్నో రకాల నేరాలను, నేర ప్రవృత్తులు గల మనుషులను చూసిన ఎస్.ఐ. ఈ నిజాన్ని జీర్ణించుకోలేకపోయాడు. నుదురుకు పట్టిన చెమటను తుడుచుకుంటూ జీపులో నితిన్ ఇంటికి బయల్దేరాడు.

ఎస్.ఐ. జీపులో నుండి దిగుతూనే 'మీ పాపను హత్య చేయించేందుకు పూనుకొన్న నేరానికిగాను నిన్ను అరెస్టు చేస్తున్నాం నితిన్' ఎస్.ఐ. మాటలకు వొణికిపోయాడు నితిన్. అతని మొహంలో నెత్తుటి చుక్క లేదు. మొహమంతా పాలిపోయింది. అతని మెదడంతా బొంతను కుట్టినట్లుగా ఉంది. హృదయంలో కోటి సూదులు గుచ్చినంత బాధ. నేలంతా మేకులు తాపి నడిచినంత బాధ. కళ్ళల్లో నీరు ఉప్పెనలా ఉబుకుతోంది. కాళ్ళు భూమిలో కూరుకుపోతున్నాయి. తను అగాధంలో పడిపోతున్నాడు.

ఈ వార్త విన్న నీరజ గుండెల్లో శరాఘాతం దూసుకుపోయింది. శరీరం విద్యుదాఘాతానికి గురైంది. ఆమె మస్తిష్కం మొద్దుబారిపోయింది. వర్షంలో తడిసిన మాదిరి ఒళ్ళంతా చెమట పట్టింది. కన్నపేగు తల్లడిల్లింది. కళ్ళు బైర్లు కమ్మాయి. నీరజ స్పృహ తప్పి పడిపోయింది. ఎస్.ఐ. తక్షణమే అంబులెన్సు తెప్పించి నీరజను ఆసుపత్రిలో చేర్పించాడు. నీరజ చంటిబాబుని పోలీసు పర్యవేక్షణలో ఉంచాడు.

నితిన్ గుండెలు కొట్టుకుంటున్నాయి. శాలిని తన గారాల కూతురు. శాలినికి తనంటే ఎంతో ప్రేమ. ఆడపాపగా పుట్టడమే నేరమా? తలలో నరాలు చిట్లిపోతున్నాయి. పురుళ్ళు, కేశఖండన, రజస్వల, విద్య, పెళ్ళి, లక్షల కట్నాలు, కానుకలు - నా ఆలోచనలు ఎందుకిలాసాగాయి. నేనెందుకింత మానసిక దౌర్బల్యానికి లోనయ్యాను. కూతుళ్ళలో ఉన్న ప్రేమ, వాత్సల్యం కొడుకుల్లో లేదని వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు ఘోషిస్తున్నారే. మరి నేను చేసిందేమిటి? అంతర్మథనం చెందుతున్నాడు నితిన్.

స్త్రీ జాతిపట్ల ఎన్నో కఠోర ఆచారాలు, ఆంక్షలు, ఆధిపత్యాలు, వ్యవస్థ స్త్రీ పట్ల ఎందుకీ వివక్ష చూపుతుంది? కొందరు స్త్రీ జాతిని అండ స్థాయిలోనే అంతం చేస్తున్నారు. ఎవరిచ్చారీ హక్కు పురుష జాతికి? ప్రకృతికి విరుద్ధమైన ఈ చర్య సమర్థనీయమేనా? స్త్రీ జాతి అంతరిస్తే మానవ మనుగడ సాగుతుందా?

మానసిక దౌర్బల్యుడైన నితిన్ 'మహానగరాల్లో నర్సులు ప్రొఫెషనల్ కిల్లర్స్‌గా పనిచేస్తున్నారని' ఓ పత్రికలో చదివాడు. డబ్బు ఎర చూపించి తన పాపని హత్య చేయడానికి ఓ నర్సుని నియోగించాడు నితిన్. ఎంత అమానుషత్వం.

పాప మధుర స్మృతులు నితిన్‌ని నిలువునా కాల్చేస్తున్నాయి. అమాయకమైన పాప మోము, రూపం నితిన్ కళ్ళల్లో కదలాడుతున్నాయి. 'నా పాపానికి నిష్కృతి లేదు. నేను హంతకుణ్ణి. నన్ను ఉరితీయండి' తలను బాదుకుంటూ తన పాప, భార్య, చంటి ఎక్కడ? పిచ్చివాడిలా కేకలు వేయసాగాడు. జుట్టు పీక్కోసాగాడు. వెర్రివానిలా విలపించసాగాడు. ఇంతలో నర్సు పాపతో నితిన్ ముందు ప్రత్యక్షమయింది. అప్పుడు ఎస్.ఐ. నితిన్‌తో జరిగినదంతా వివరించాడు. 'నితిన్ నీవనుకున్నట్టు నర్సు పాపను చంపలేదు. స్త్రీ జాతికే గర్వకారణంగా నిలిచిన ఆ నర్సు మానవతా విలువలతో మృత్యువు బారి నుండి మీ పాపను రక్షించింది'

నీరజ హాస్పిటల్‌లో మృత్యువుతో పోరాడుతోంది. అందరూ కలిసి హాస్పిటల్‌కు వెళ్ళారు. అన్ని రకాల ప్రయత్నాలు చేసి ఇక ఫలితం లేదని కాబోలు ఆఖరి శ్వాస కొరకు ఎదురు చూస్తున్నట్టుగా ఉంది అక్కడి వాతావరణం. గుండెలు పిండే దైన్యస్థితిలో ఆ మాతృమూర్తి మంచాన పడి ఉంది. పాప నీరజ దగ్గరకు వెళ్ళి 'అమ్మా అమ్మా' అని బిగ్గరగా పిలిచింది. వాళ్ళమ్మను పట్టుకొని కుదిపింది పాప. నీరజలో చలనం మొదలయింది. కళ్ళు విప్పారాయి. అనంతకోటి జ్యోతులు ఆమె కళ్ళల్లో వెల్లివిరిసాయి. ★